
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
7
మంగళవారం 14 జనవరి 2025



వైసీపీని వీడనున్న మాజీ ఎమ్మెల్యే రాజశేఖర్



- మరోసారి పరాభవంతో కుమిలిపోతున్న మర్రి
- ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు అతని భార్యకు సీటిస్తానని మాట ఇచ్చి తప్పిన జగన్
- గుంటూరులో ఓడిన రజనీకి తిరిగి చిలకలూరిపేట పగ్గాలు
- అప్పటి నుంచి రగిలిపోతున్న రాజశేఖర్

8

సరదాల సంక్రాంతి!



గుంటూరు : ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన భోగిమంటలు

భానుడి ఉత్తరాయాణంతో వెలుగులు పండే సుదినం

పంట చేతికొచ్చిన వేళ రైతులు చేసుకునే సంబరాలు

జిల్లా వ్యాప్తంగా ఘనంగా భోగి వేడుకలు

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రులకు అత్యంత ప్రీతిపాత్రమైన పండుగ మకర సంక్రాంతి. తెలుగునాట ప్రతి ఇంటా ఆ సంక్రాంతి తెచ్చే సంతోషం అంతా ఇంతా కాదు. దేశంలో ఎక్కడున్నా.. ఆ సుదినాన అందరూ సొంత గ్రామాలకు ప్రయాణం కట్టేస్తారు. అవకాశం ఉండాలే కాని విదేశాల్లో ఉన్నవారు సైతం సొంత ఊరి బాట పడతారు. ముచ్చటగా మూడు రోజులు, అదృష్టం కలిసి వస్తే నాలుగు రోజులు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి సంబరాలు చేసుకుని సంతోషాలను ప్రోది చేసుకుంటారు. ఆ మధురానుభూతులతో తిరుగు ప్రయాణం కడతారు.

ధనుర్మాసంలో సూర్య భగవానుడు దక్షిణాయాణం ఉచ్ఛదశను చేరుతాడు. భోగి పండుగ రోజున దక్షిణాయాణాన్ని పూర్తి చేసుకుని ఉత్తరాయణాన్ని ప్రారంభిస్తాడు. ఆ సమయంలో ప్రతి ఒక్కరూ తమ సామర్థ్యం మేరకు దానధర్మాలు చేస్తే మంచిదని ప్రతీతి. అలా చేయడం వల్ల శుభ ఫలితాలొస్తాయని జనం నమ్ముతుంటారు. కొత్తగా పెళ్లి చేసుకున్న వారు బొమ్మల నోము, సావిత్రి గౌరీ వ్రతం చేస్తారు. మరికొందరు మకర సంక్రాంతి రోజున తమ పూర్వీకుల ఆత్మ శాంతి కోసం తమ సామర్థ్యం మేరకు దానధర్మాలు చేస్తారు.

పురాణాల ప్రకారం 'సంక్రాంతి'

పురాణాల ప్రకారం.. మకర సంక్రాంతి రోజునే భగిరథుడు తన తపస్సుతో ఆకాశంలో ఉండే గంగమ్మను భువిపైకి తీసుకొస్తాడు. తమ పూర్వీకులకు తర్పణం సమర్పించేందుకు భగిరథ మహర్షి గంగమ్మను భువిపైకి ఆహ్వానిస్తాడు. తన ప్రతిపాదనను అంగీకరించి మకర సంక్రాంతి పండుగ రోజున గంగాదేవి భువిపైకి వస్తుంది. గంగాదేవి భూమి పైకి వచ్చిన సుదినమైన రోజు కావడంతో ఆ రోజున మకర సంక్రాంతి పండుగ చేసుకుంటారు. కాబట్టి ఆ పవిత్రమైన రోజున గంగానదిలో లేదా ప్రవహించే నీటిలో స్నానం చేస్తే పుణ్యఫలాలు పొందుతారని పురాణాలు చెబుతున్నాయి. సంక్రాంతి నెలలో హరిదాసుల సందడి చాలా ప్రత్యేకమైనది. హరినామ సంకీర్తనలు పాడుతూ ప్రజలను అలరిస్తూ ఇంటింటికీ తిరిగి మాలదాసరులు సందడి చేస్తారు. పంట చేతికందిన సంతోషంతో రైతులు వారికి తగిన రీతిలో ధాన్యం ఇచ్చి గౌరవించేవారు. సామాన్యులు తమకు తోచిన మొత్తం ఇచ్చేవారు.



తెనాలి : చిన్నారులతో కలిసి భోగిమంటను వెలిగిస్తున్న మంత్రి మనోహర్

మూడో రోజు ముక్క పండగ 'కనుమ'!

మకర సంక్రాంతి పండుగ ముగిసిన మరునటి రోజున కనుమ పండుగ. ఈరోజున తమ పశువులను అందంగా అలంకరించి, వాటికి ఇష్టమైన దాణా పెడతారు. కనుమ నాడు మాంసాహారం తీసుకుంటారు. కనుమకు ముక్కనుమ కూడా తోడైతే ఆ సంతోషాలకు హద్దులే ఉండవు. అలా నాలుగైదు రోజులపాటు సంక్రాంతి పండుగ సందడి చేస్తుంది. ఏడాదికి సరిపడా సంతోషాన్ని పంచుతుంది. తనివి తీరా ఆస్వాదించి పండగను ముగించుకుని అందరూ మళ్లీ పట్నం బాట పడతారు. సంవత్సరానికి సరిపడేంత సంతోషాన్ని తీసుకెళ్తారు. అందుకే సంక్రాంతిని సరదాల సంక్రాంతిగా చెప్పుకుంటుంటారు.

తీరంలో.. పందేల జోరు



కొల్లూరు మండలం అనంతవరం బరిలో జరుగుతున్న కోడి పందెం

- రూ.లక్షల్లో బెట్టింగ్‌లు
- యథేచ్ఛగా కోతముక్క పేకాట, రమ్మీ, నెంబర్ల జూదం
- భారీ బరుల ఏర్పాటు
- ఇతర రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన పందెం రాయుళ్లు
- జోరుగా మద్యం అమ్మకాలు
- వీఐపీలకు నాటుకోడి, మటన్ బిర్యానీ
- పందేలను వీక్షించిన మంత్రి అనగాని, జనసేన నాయకులు



కొల్లూరు : పందెం బరి వద్ద జోరుగా సాగుతున్న జూద క్రీడ



చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో పందెం వేసేందుకు కోడి పుంజులతో సిద్ధంగా ఉన్న పందెంరాయుళ్ళు



తూర్పుపాలెంలో నెంబర్లాట ఆడుతున్న పందెంరాయుళ్ళు

తెనాలి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పందెంకోళ్ళ పౌరుషంతో కత్తులు దూస్తే పేకముక్క జూదప్రియుల చేతుల్లో గుండాట ఆడింది.కోతముక్క లక్షల నోట్లకట్టల కట్లుతెంపింది. తమ జాతకాన్ని పరిక్షించుకునేందుకు ఎంతోమంది అదృష్టాన్ని నెంబర్లాట తారుమారుచేసింది. మద్యం ఏరులైపారింది. సంప్రదాయం మాటున నిషేధాజ్ఞలను కూడా లెక్కచెయ్యకుండా పందెంరాయుళ్ళు విచ్చలవిడిగా పందాలు వేశారు. డెల్టాప్రాంతంలో వారంముందునుంచే కోడిపందేలు కోతముక్క జోరందుకుంటే అనధికార అనుమతులతో సోమవారం నుంచి బహిరంగంగానే కోడిపందేలను కొనసాగించారు. భోగి రోజున భారీస్థాయిలో పందేలు కాయటం, నోట్లను విరజిమ్మటం చూస్తే వాటిని నియంత్రించాల్సిన అధికారులకు ప్రేక్షకపాత్రగానే మిగిలిపోయింది. గుంటూరు,బాపట్ల,పల్నాడుజిల్లాలో కొన్నిచోట్ల మాత్రమే అధికారపార్టీ నేతల కన్నుసన్నుల్లోనే బరులు సిద్ధమై కోడిపందేలను వేశారు.

తీరప్రాంతంలో జోరుగా కోడిపందేలు

తీరంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సంప్రదాయాలను అడ్డంపెట్టుకుని అధికారపార్టీ నాయకుల ఆధ్వర్యంలో కోడిపందేలు జోరుగా కొనసాగాయి. పందెం రాయుళ్ళు నాలుగు జిల్లాలతోపాటు తెలంగాణా రాష్ట్రం నుంచి వేలాదిగా తరలి రావటంతో భోగిరోజు మొదటిరోజున లక్షలాది రూపాయలు పందేలు జోరుగా సాగాయి. ఈపందేలను రెవెన్యూశాఖ మంత్రి అనగానిసత్యప్రసాద్, జనసేనపార్టీ జిల్లానాయకులు స్థానిక టీడీపీ నాయకులు పలువురు ప్రముఖులు వీక్షించారు. రేపల్లె నియోజకవర్గంలో చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో, వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం పల్లెకోనలో భారీగా కోడిపందేలు జరిగాయి. దృష్టిసారించాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైనా చూసిన దాఖలాలు లేవు. అధికారులపై రాజకీయ నాయకులు తీవ్ర ఒత్తిడి తేవటంతో చేసేదిలేక అధికారులు కూడా చేతులెత్తేశారు. దీంతో పందెం రాయుళ్ళు జోరుగా హద్దుఅదుపులేకుండా పందేలను నిర్వహించారు. ఈరెండుచోట్ల అధికార పార్టీ ప్రధాన నాయకుని ఆధ్వర్యంలో పదిహేను బరులను ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. బరుల సమీపంలోనే హైటెక్ క్లబ్‌ల తరహాగా పేకాట కోసం ప్రత్యేక గుడారాలు వేసి పేకాట, కోతముక్క ఆటలు జోరుగా కొనసాగించారు. లక్షలాది రూపాయలతో వేలాది మంది పందెం రాయుళ్ళు పాల్గొని పందేలను వేశారు. తూర్పుపాలెంలో రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు, రూ.లక్ష వరకు ప్రత్యేక బరులను ఏర్పాటు చేసి నిర్వాహకులు పందేలు నిర్వహించారు. వీఐపీ బరుల్లో లక్ష నుంచి రూ.3లక్షల వరకు కోడిపందేలు నిర్వహించారు. గుండాట, నెంబర్లాట విచ్చలవిడిగా కొనసాగించారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి, తెలంగాణా రాష్ట్రం నుంచి వేలాదిగా పందెం రాయుళ్ళు తరలివచ్చారు. పల్లెకోనలో ఆరు బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు జోరుగా కొనసాగించారు. బరుల సమీపంలో ఒక్కో బరిలో రెండు స్టాల్స్ ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు భారీగా జరిపారు. విద్యుత్ శాఖాధికారులు నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, విద్యుత్ లైన్లు లాగి భారీ సంఖ్యల్లో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు.

నేడు రూ. 2 లక్షల పందేలు

కొల్లూరు మండల పరిధిలోని అనంతవరం, క్రాప అడ్డ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పందెం బరుల వద్దకు పందెంరాయుళ్ల వందల సంఖ్యలో తమ మేలుజాతి కోడి పుంజులతో పందేలు వేసేందుకు తరలి వచ్చారు. పెద్ద మొత్తంలో కోడి పందేలు వేయడంతో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. రూ.20 వేలు నుంచి రూ.లక్ష వరకు పందేలు జోరుగా సాగాయి. నిర్వాహకులు పందెం రాయుళ్ల కోసం బరుల వద్ద అన్ని ఏర్పాట్లు కల్పించారు. మరోవైపు కోతముక్క, గుండాట, నెంబర్లు ఆట, రాత్రింబవళ్లు పేకాట స్థావరాలను కూడా ఏర్పాటు చేశారు. టీ నుంచి బిర్యానీ వరకు బరి వద్దే పందెం రాయుళ్ల కోసం స్టాల్స్ వెలిశాయి. ద్విచక్ర వాహనానికి రూ.50, కార్లకు రూ.100 పార్కింగ్ రుసుంగా వసూలు చేస్తున్నారు. పందేలు తిలకించేందుకు మహిళలు, యువతులు కూడా ఆసక్తి చూపడంతో సందడి వాతావరణం నెలకొంది.

మంగళవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని క్రాప అడ్డరోడ్డు వద్ద నిర్వాహకులు ఒక్కో పందెం రూ.2 లక్షలు చొప్పున 9 పందాలు నిర్వహిస్తున్నట్లు మైకుల్లో ప్రచారం చేశారు. ఎక్కువ పందేలు గెలుపొందిన కోడి యజమానికి ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా ప్రకటించారు.



తూర్పుపాలెంలో బరులవద్దే యథేచ్ఛగా మద్యం సేవిస్తున్న మందుబాబులు



తూర్పుపాలెంలో పార్కింగ్‌లో భారీగా నిలిచిన ద్విచక్రవాహనాలు,కారులు

సాహిత్యరంగానికి లక్ష్మీనారాయణ ఎనలేని సేవ

● మాజీ మంత్రి ఆలపాటి



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగానికి అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ ఎనలేని సేవ చేశారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మట్టి మనిషి మహానాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకోనున్న లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆలపాటి మాట్లాడుతూ పాశ్చాత్య నాగరికత కారణంగా రంగస్థలానికి ప్రాధాన్యం తగ్గుతున్నప్పటికీ ఎంతోమంది అభిమానులు, దాతలు వాటిని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. నాటకం ప్రదర్శించిన 50 మంది నటీ నటులు, సాంకేతిక నిపుణులను సత్కరించారు. ఈదర వెంకటపూర్ణచంద్, వల్లూరు శివప్రసాద్, బుర్రా సాయిమాధవ్, కనపర్తి బెన్‌హర్, షేక్ జానీబాషా పాల్గొన్నారు.

వైసీపీని వీడనున్న మాజీ ఎమ్మెల్యే రాజశేఖర్

● మరోసారి పరాభవంతో కుమిలిపోతున్న మర్రి
● ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు అతని భార్యకు సీటిస్తానని మాట ఇచ్చి తప్పిన జగన్
● గుంటూరులో ఓడిన రజినీకి తిరిగి చిలకలూరిపేట పగ్గాలు
● అప్పటి నుంచి రగిలిపోతున్న రాజశేఖర్



గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వరుస పరాభవాలతో కుంగిపోతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. వైసీపీ ఆవిర్భావ సమయంలో జిల్లాలో ఆ పార్టీకి రథ సారథ్యం వహించి ఎంతో అంకితభావంతో పనిచేసి నప్పటికీ పార్టీలో నుంచి అతన్ని పంపించేందుకు తొలి నుంచి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. 2004లో ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డికి వీరవిధేయుడిగా ఉండి ఆ ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009 ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ తరుపున పోటీచేసి ఓడిపోయినప్పటికీ నియోజకవర్గాన్నే అంటి పెట్టుకొని పార్టీ పురోభివృద్ధి కోసం పనిచేశారు. అనంతరం వైసీపీ ఆవిర్భావంతో జగన్ వెంట పయనించి జిల్లా పార్టీ పగ్గాలు చేపట్టారు. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ తరుపున పోటీ చేసి పరాజయం పాలైనా నియోజకవర్గాన్నే అంటిపెట్టుకొని ఉన్నారు. అయితే 2019లో ఆయనకు చివరి క్షణంలో సీటు నిరాకరిస్తూ కొత్తగా పార్టీలో చేరిన విడదల రజినీకి సీటు ఇచ్చారు.

ఎమ్మెల్సీ.. మంత్రి పదవి ప్రకటించి కూడా..

ఆ ఎన్నికల ప్రచారంలో భాగంగా చిలకలూరిపేట వచ్చిన జగన్ సభలో మాట్లాడుతూ రజినీని గెలిపిస్తే రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ పదవితో పాటు మంత్రి పదవిని ఇచ్చి తన కేబినెట్‌లోకి తీసుకుంటానని ప్రకటించాడు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ మంత్రి పదవి అటుంచి రెండేళ్ల పాటు కనీసం ఎమ్మెల్సీ హోదా కూడా కల్పించలేదు. అయితే పుండు మీద కారం చల్లినట్లు రాజశేఖర్‌కు ఇస్తానని చెప్పిన మంత్రి పదవిని రజినీకి ఇచ్చారు. దీంతో అప్పట్లోనే ఆయన అనుయాయులు అతన్ని పార్టీ వీడి టీడీపీలో చేరమని ఒత్తిడి చేశారు. ఈ నేపథ్యంలో మర్రికి ఒట్టి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. తిరిగి 2024 ఎన్నికల సమయానికి రజిని తిరిగి చిలకలూరిపేట నుంచి గెలవదని భావించి గుంటూరు పశ్చిమకు తీసుకొచ్చారు. ఆ సమయంలోనైనా స్థానికంగా పట్టున్న రాజశేఖర్‌కు ఎమ్మెల్యే సీటు ఇవ్వకుండా స్థానికేతరుడైన గుంటూరు మేయర్‌ను చిలకలూరిపేట నుంచి బరిలోకి దించి చేతులు కాల్చుకున్నారు. ఇక రజినీ గుంటూరులో కూడా ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో తిరిగి మర్రిని జగన్ తన వద్దకు పిలిపించుకొని ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ముఖ్య నేతల సమక్షంలో ఈసారి చిలకలూరిపేట ఇన్‌చార్జ్ బాధ్యతలు అతనికే ఇస్తానని చెప్పటమే కాకుండా, ఎమ్మెల్యే సీటు అతని భార్యకు ఇస్తానని, ఈ విషయాన్ని త్వరలో ప్రకటిస్తానని చెప్పి పంపించారు.

మళ్లీ రజినీకే బాధ్యతలు అప్పగించడంతో..

అయితే కొద్ది రోజులకే జగన్ హఠాత్తుగా తిరిగి రజినీకి చిలకలూరిపేట ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ వచ్చే ఎన్నికల్లో అక్కడ నుంచే పోటీ చేసేందుకు పరోక్షంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో మరోసారి మర్రి విషయంలో వైసీపీ అధినేత మాట తప్పి అవమాన పరిచాడు. ఈ పరిణామాన్ని జిల్లాలోని ఆ పార్టీ పెద్దలు సైతం జీర్ణించుకోలేకపోయారు. దీంతో మర్రికి ఇక వైసీపీలో తాను ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కదనే నిర్ణయానికి వచ్చారు. ఒక రకంగా చిలకలూరిపేట అంటే కాంగ్రెస్ హయాంలో మర్రి మామ సోమేపల్లి సాంబయ్య పేరు ఆ తరువాత కాంగ్రెస్‌లోనూ, వైసీపీలోనూ రాజశేఖర్ పేరే వినిపించేది. అటువంటి రాజకీయ చరిత్ర ఉన్నప్పటికీ ప్రస్తుతం అనామకుడిగా ఉండాల్సి వస్తుందని ఆయన రగిలిపోతున్నారు. మర్రి పరిస్థితిని గమనించి వైసీపీలో ఉండగా తనకు అత్యంత ఆత్మీయుడిగా ఉన్న రాజశేఖర్‌ను టీడీపీలోకి తీసుకొచ్చేందుకు కొద్ది రోజులుగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అదే విధంగా నియోజకవర్గంలోని తన అనుయాయుల నుంచి కూడా తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తుండటంతో సంక్రాంతి పండగ తరువాత మంచి ముహూర్తం చూసుకొని టీడీపీలో చేరే ఉద్దేశంలో రాజశేఖర్ ఉన్నట్టు తెలిసింది. ఇప్పటికే జగన్‌కు ఈ సమాచారం అందటంతో జిల్లాలోని వైసీపీ నేతలను పురమాయించి అతన్ని ఆపే ప్రయత్నం చేయమని చెప్పినప్పటికీ జిల్లా నేతలు చేతులు ఎత్తేసినట్టు తెలిసింది. ఒకటి కాదు రెండు కాదు వరుస పరాభవాలతో ఆగ్రహంతో ఉన్న మర్రిని ఏమని సముదాయించగలమనే భావనతో వారు మిన్నకుండిపోయినట్లు తెలిసింది.

పేదలకు నాట్కో వైద్య సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



మునిపల్లెలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నాట్కో సంస్థ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలను సోమవారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, మేనేజింగ్ ట్రస్టీ, నాట్కో ఫార్మ లిమిటెడ్ సీఎస్ఆర్ అధిపతి కంటమణి స్వాతి ప్రారంభించారు. నాట్కో సంస్థల అధినేత నన్నపనేని వెంకయ్య చౌదరి స్వగ్రామం గోళ్లమూడిపాడు గ్రామ సమీపంలో ఈ ఆస్పత్రిని నిర్మించారు. ఆస్పత్రిని ప్రారంభించిన అతిథులు వివిధ విభాగాలను సందర్శించి వైద్య సేవలుపై ఆరా తీశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మునిపల్లె గ్రామంలో నాట్కో ట్రస్ట్ సహకారంతో గ్రామీణ ప్రాంతంలో మంచి నాణ్యతతో కూడిన కంటి వైద్యాన్ని అందించడం హర్షణీయం అన్నారు. ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ నేత్ర వైద్యం అందించడంలో ముందంజలో ఉందని కొనియాడారు. రెండున్నర ఎకరాలలో రూ. 15 కోట్ల వ్యయంతో నిర్మించిన హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య పరికరాలు అందించి, సమగ్ర కంటి వైద్య సేవ అందించటానికి ముందుకు వచ్చారన్నారు. నాట్కో మేనేజింగ్ ట్రస్టీ స్వాతి మాట్లాడుతూ 5 లక్షల జనాభాకు సేవలు అందించే విధంగా ఈ హాస్పిటల్‌లో రూపొందించినట్లు చెప్పారు. ఏడాదికి ఐదు వేల శస్త్రచికిత్సలు అందించే సామర్థ్యంతో హాస్పిటల్ నిర్మించినట్లు తెలిపారు. డాక్టర్లు మినహా మిగిలిన సిబ్బంది మొత్తాన్ని స్థానికులనే ఎంపికచేసి శిక్షణ ఇచ్చి కేంద్రంలో నియమించినట్లు చెప్పారు. అర్హులైన పేద ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాట్కో ఫార్మ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు, ఆనందబాబు, తులసి, ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ డాక్టర్ రాజీవ్ రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ రోహిత్ కన్నా, నెట్వర్క్ డైరెక్టర్ జీపీఆర్ఎస్ ఐ కేర్ డాక్టర్ అనన్య, ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ విజయవాడ బ్రాంచ్ హెడ్ డాక్టర్ ప్రవీణ్, కృష్ణ, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, పక్కన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఎన్టీఆర్ మహోన్నతుడు

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

సత్తెనపల్లి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో తారాస్థాయికి ఎదిగి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నతుడు ఎన్టీఆర్ అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం దీపాలదిన్నెపాలెం గ్రామంలో సోమవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటేనే ఒక సంచలనం అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లి ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాజకీయాల్లో ఎన్టీఆర్ ఒక చరిత్రను సృష్టించారన్నారు. సంక్షేమం అంటే గుర్తుకు వచ్చేది ఎన్టీఆర్ అని, తరాలు మారినా ప్రజల గుండెల్లో ఆయన స్థానం పదిలం అన్నారు. ముందుగా ఎంపీ, ఎమ్మెల్యేలు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూల దండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలికారు. విగ్రహ ఏర్పాటు స్థల దాత పారుపల్లి నాగేశ్వరరావు, విగ్రహదాత పారుపల్లి పాండు రంగారావును ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ మాగులూరి భాను ప్రకాష్, దరువూరి నాగేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు పాటిబండ్ల పూర్ణచంద్రరరావు, కిలారు క్రిష్ణగిరి సుమన్(గిరి), దేవరపల్లి వెంకటేశ్వరరావు, పాటిబండ్ల త్రినాథ్(చింటు), పారుపల్లి అనీల్, పారుపల్లి సాయిబాబు, నారుకొండ వీర వర ప్రసాదు, బోడెపూడి కోటేశ్వరరావు, గోళ్ళమూడి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గౌతమబుద్ధుని సూక్తులు ఆచరించాలి

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సమ సమాజంలో శాంతి, సౌఖ్యం విరజిల్లాలంటే గౌతమబుద్ధుని ఆశయాలు, సూక్తులు ప్రజలంతా ఆచరించాలని శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధిహిన్ పేర్కొన్నారు. సోమవారం పౌర్ణమి పురస్కరించుకుని మండల కేంద్రం భట్టిప్రోలులోని బౌద్ధారామంలో స్థూపం చుట్టూ ప్రదక్షిణలు చేసి దీపారాధన చేశారు. అనంతరం సుదర్శన మోహనరావు అధ్యక్షతన జరిగిన సభలో బౌద్ధ భిక్షువు బోధిహిన్ మాట్లాడుతూ మనిషి చెప్పిన ప్రకారం అతని ఆత్మ నడుచుకున్నప్పుడే సమాజంలో శాంతి విరాజిల్లుతుందన్నారు. బుద్ధుని సూక్తులను వివరించారు. స్థూపం ఆవరణలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు. ప్రకాశం జిల్లా ఏఎస్పీ ఎంఎస్ఎస్ అశోక్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుద్ధిజాన్ని స్వీకరించారని చెప్పారు. కార్యక్రమంలో తుపాకుల హరిప్రసాద్, ఏవీఎస్ రాజు, ఈగ శ్రీనివాసరావు, క్రాంతి, కసుకుర్తి హరిప్రసాద్, తిరుమలశెట్టి ప్రసన్న కుమార్, బౌద్ధఉపాసకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130,139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

రాష్ట్రస్థాయి పడవ పోటీల్లో.. విజేతగా రామాపురం పల్లెకారుల జట్టు



ఆత్రేయపురం పడవ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రామాపురం పల్లెకారుల జట్టు

దాచేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగిన పడవ పోటీల్లో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం పల్లెకారుల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. సేకరించిన వివరాల మేరకు.. కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో సంక్రాంతి పండగకు పడవ పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. పడవ పోటీలకు కేరళ, విజయవాడ, కృష్ణా, నాగాయలంక, కోటిపల్లి, ఎన్టీఆర్, భీమవరం జిల్లాల నుంచి హాజరయ్యారు. ఈ క్రీడలకు అన్నిజిల్లాలతోపాటు పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం, రామాపురం గ్రామానికి చెందిన పల్లెకారులు హాజరయ్యారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పల్లెకారులు తమ ప్రతిభను విశేషంగా చాటి మొదటిస్థానంలో నిలిచారు. పల్నాడు ప్రాంతానికి చెందిన పల్లెకారులు కోనసీమ జిల్లాలో పోటీ పడవలు నడిపే జట్ల కంటే అత్యంత నైపుణ్యంగా ముందుగా నడిపి స్థానికుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. స్థానిక కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా లక్ష రూపాయల నగదు, షీల్డు అందుకున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారిలో జట్టు కెప్టెన్ మల్లాడి సైదులు, పొప్పుడి వీరబాబు, తేలు చినరాజు, కర్రా నాగరాజు, కర్రా రాంబాబు, కొల్లి జాని, కొల్లి సందీప్, మల్లాడి చినసైదులు, చేడారి కిరణ్, మల్లాడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు మరో జట్టు కూడా పాల్గొంది.

విశ్రాంత ఎస్పీ మాణిక్యాలరావు మృతి




మాణిక్యాలరావు (ఫైల్‌ఫొటో)

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఎస్పీ ఉద్దంటి మాణిక్యాలరావు (75) అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయన 1970లో ఎస్ఐగా శిక్షణ పూర్తి చేశారు. ఎస్ఐగా తాడికొండ, పట్టాభిపురం, లాలాపేట తదితర స్టేషన్‌లలో, సీఐగా తెనాలి, గుంటూరు ఈస్ట్, నెల్లూరు ఏసీబీ, కాకినాడ సివిల్ సప్లయస్, జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో పని చేశారు. డీఎస్పీగా ఖాజీపేట, పాలకొండ, గుంటూరు ఇంటిలెజెన్స్‌లో పని చేశారు. కరీంనగర్‌లో ఏఎస్పీగా, ఎస్పీగా పని చేస్తూ 2007లో ఉద్యోగ విరమణ చేశారు. ఏపీ విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎ.రవిచంద్ర, ఎం రంగప్రసాదరావు, డి.సుబ్బారెడ్డి, గౌరవ అధ్యక్షుడు వెల్లంకి లక్ష్మీనారాయణ, వాసుదేవరెడ్డి, భూపాల్ సింగ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాలకొండయ్య, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఆర్ నాయుడు, విశ్రాంత డీజీపీ రాజీవ్ త్రివేది, ఎంవీ కృష్ణారావు, జి.నారాయణ స్వామి సంతాపం తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కొత్తపేటలో భారీ చోరీ

● 379 గ్రాముల బంగారం, ఐదు వేలు నగదు అపహరణ



దొంగలు లూటీ చేసిన బీరువా, పక్కన బాధితులు

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేట రంగా బొమ్మ వెనుక శ్రీలక్ష్మీ హాస్పిటల్స్ పక్క వీధిలో నివాసం ఉంటున్న దేవరకొండ వెంకటరమణ ఇంటిలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. సుమారు రూ. 27 లక్షల ఖరీదైన 379 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదువేల నగదు అపహరించుకుపోయారు. వెంకట రమణకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గతంలో వెంకటరమణ ఆటో నడిపేవారు. కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఆటో నడపడం మానేశారు. ముగ్గురు కుమార్తెలు వేర్వేరు చోట్ల ఉండి చదువుకుంటున్నారు. పండగకు ఇంటికి వచ్చారు. బంగారం పెట్టుకోవాలని బ్యాంకులో ఉంచిన ఆభరణాలను ఇంటికి తెచ్చుకున్నారు. ఆదివారం రాత్రి వెంకటరమణ, భార్య, ముగ్గురు కుమార్తెలు ముందుగానే నిద్రించారు. అయితే పడుకున్న సమయంలో తలుపునకు లోపల గడివేయడం మర్చిపోయారు. దీంతో దొంగలు సులువుగా ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో బంగారం పెట్టి తాళాలను పరుపు దిండు కింద ఉంచారు. దీంతో దొంగలు తాళాలు తీసుకొని బీరువా తెరిచి అందులో ఉంచిన బంగారాన్ని అపహరించుకుపోయారు. సోమవారం ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వీరయ్య చౌదరి, క్లూస్ టీం ఇంటిని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 564.30 అడుగులు ఉంది. ఇది 242.48 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6556 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 8246 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,002 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank
గుంటూరు మెయిన్ బ్రాంచ్
హిందూ హైస్కూల్ క్యాంపస్ మెయిన్‌రోడ్, గుంటూరు-522003, ☎ 0863-2221751

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇకమీదట "చట్టం" గా పిలవబడును) ప్రకారం **కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు** సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత: మెస్సర్స్ విజయభువనేశ్వరి కాటన్ ఫైబర్స్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రైయిటర్: శ్రీమతి కంచర్ల అరుణ కుమారి (0605261010564)** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయిసొమ్ము **రూ.9,83,91,308.50/- (అక్షరాల తొమ్మిది కోట్ల ఎనభై మూడు లక్షల తొంభై ఒక్క వేల మూడు వందల ఎనిమిది రూపాయలు మరియు యాభై పైసలు)** + వడ్డీ, ఖర్చులను కలిపి మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది **16.11.2016న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని **09.01.2025 వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు & ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత / హామీదారు / తనఖాదారు మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్, గుంటూరు మెయిన్ బ్రాంచ్** వారికి చెల్లించవలసిన బకాయి **రూ. 9,83,91,308.50/- (అక్షరాల తొమ్మిది కోట్ల ఎనభై మూడు లక్షల తొంభై ఒక్క వేల మూడు వందల ఎనిమిది రూపాయలు మరియు యాభై పైసలు)** + వడ్డీ మరియు కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

1) గుంటూరు, బ్రాడీపేట, బిడిసిసి బ్యాంక్ వెనుకవైపు, 2/13 లైను, డోర్ నెం.5-14-8/2 నందు **12-04-2013 తేదీగల విక్రయ దస్తావేజు నెం.4945/2013 ద్వారా శ్రీమతి కంచర్ల అరుణ కుమారి, భర్త: శ్రీ కె.శంకరరావు పేరునగల 97 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ పాత భవనము. హద్దులు: తూర్పు:** రోడ్డు; **దక్షిణం:** కంచర్ల శంకరరావు యొక్క ఆస్తి; **పడమర:** కంచర్ల అరుణకుమారి యొక్క ఆస్తి; **ఉత్తరం:** కొండా వెంకటప్పయ్య యొక్క ఆస్తి.

2) గుంటూరు, బ్రాడీపేట, బిడిసిసి బ్యాంక్ వెనుకవైపు, 2/13 లైను, డోర్ నెం.5-14-8/2 నందు **12-04-2013 తేదీగల విక్రయ దస్తావేజు నెం.4944/2013 ద్వారా శ్రీమతి కంచర్ల అరుణకుమారి, భర్త: శ్రీ కె.శంకరరావు పేరునగల 698 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ పాత భవనము. హద్దులు: తూర్పు:** కంచర్ల శంకరరావు నుండి కొంత మేరకు, కంచర్ల అరుణకుమారి నుండి కొంత మేరకు; **దక్షిణం:** కంచర్ల శంకరరావు యొక్క ఆస్తి; **మరల తూర్పు:** కంచర్ల శంకరరావు యొక్క ఆస్తి; **మరల దక్షిణం:** 4.5 అ॥ వెడల్పుగల గల్లీ; **పడమర:** శారదానికేతన్ విద్యాలయం ఆస్తి; **ఉత్తరం:** కొండా వెంకటప్పయ్య యొక్క ఆస్తి.

3) గుంటూరు, బ్రాడీపేట, బిడిసిసి బ్యాంక్ వెనుకవైపు, 2/13 లైను, డోర్ నెం.5-14-8/2 నందు **12-04-2013 తేదీగల విక్రయ దస్తావేజు నెం.4943/2013 ద్వారా శ్రీ కె.శంకరరావు, తండ్రి: పెద మల్లయ్య పేరునగల 78.33 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ పాత భవనము. హద్దులు: తూర్పు:** రోడ్డు; **దక్షిణం:** ఇతరుల యొక్క ఆస్తి; **పడమర:** కంచర్ల శంకరరావు నుండి కొంత మేరకు, కంచర్ల అరుణకుమారి నుండి కొంత మేరకు; **ఉత్తరం:** కంచర్ల అరుణకుమారి యొక్క ఆస్తి.

4) గుంటూరు, బ్రాడీపేట, బిడిసిసి బ్యాంక్ వెనుకవైపు, 2/13 లైను, డోర్ నెం.5-14-8/2 నందు **12-04-2013 తేదీగల విక్రయ దస్తావేజు నెం.4942/2013 ద్వారా శ్రీ కె.శంకరరావు, తండ్రి: పెద మల్లయ్య పేరునగల 558 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ పాత భవనము. హద్దులు: తూర్పు:** కంచర్ల శంకరరావు నుండి కొంత మేరకు & ఇతరుల నుండి కొంతమేరకు; **దక్షిణం:** 4.5 అ॥ వెడల్పుగల గల్లీ; **పడమర:** కంచర్ల అరుణకుమారి ఆస్తి; **ఉత్తరం:** కంచర్ల అరుణకుమారి ఆస్తి.

గమనిక: 1431.33 చ॥గ॥ విస్తీర్ణము గల స్థలము మరియు అందులోని రెసిడెన్షియల్ భవనము (బ్రాడీపేట, బిడిసిసి బ్యాంక్ వెనుకవైపు, 2/13 లైను, డోర్ నెం.5-14-8/2, దస్తావేజు నెం.4945/2013, 4944/2013, 4943/2013, 4942/2013 ప్రకారము).

తేది: 09.01.2025
ప్రదేశం: గుంటూరు

సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్




భోగి మంటలు వేస్తున్న దేగల ప్రభాకర్

దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా తొలిరోజు భోగి పండుగను దేగల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామీణ వాతావరణాన్ని తలపిస్తూ, ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసా లు, హరిదాసుల సంకీర్తనలు, రంగవల్లులు కనువిందు చేశాయి. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలు అంతరించిపోకుండా భావితరాలకు తెలియజేయడం, వారు పాటించేలా చేయడమే లక్ష్యంగా వేడుకలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సంక్రాంతి వేడుకలు చూస్తోంటే తమ చిన్ననాటి మధుర స్మృతులు గుర్తుకు వచ్చాయని ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేశారు.

వైభవంగా శ్రీగౌరీ విశ్వేశ్వర స్వామి కల్యాణం

గుంటూరు(తూర్పు), జనవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, శ్రీగౌరీవిశ్వేశ్వరస్వామి జన్మనక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం దంపతులచే అర్చకులు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమాల్ని దేవాలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ, గిరిధర్, వాసు పర్యవేక్షించారు.

రూ.2800 కోట్ల బకాయిలు విడుదల హర్షణీయం

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి అమ్మయ్య

గుంటూరు సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉంచిన రూ.2800 కోట్ల బకాయిలు ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయటం హర్షణీయమ ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి పి.అమ్మయ్య అన్నారు. సంక్రాంతి కానుకగా రూ.1320కోట్లు విడుదల చేశారన్నారు. ఎన్నో రోజులుగా ఉద్యోగులు జీపీఎఫ్, సీపీఎఫ్, టీడీఎస్, ఎస్ఎల్ నగదు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏలు, పీఆర్సీ కమిటీ వేసి వేతన స్థిరీకరణను త్వరలో పూర్తిచేయాలని ప్రభుత్వానికి అమ్మయ్య విజ్ఞప్తి చేశారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

గుంటూరు(తూర్పు), జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్‌ఛార్జీలు పెంచటం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. సోమవారం బ్రాడీపేటలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్‌ఛార్జీలు పెంచబోమని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక రూ.16వేల కోట్ల భారాన్ని సర్దుబాటు ఛార్జీల పేరుతో భారం మోపారన్నారు. వెంటనే ఈ ప్రతిపాదనలను విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కల్యాణి, కంచుమాటి అజయ్‌కుమార్, భైరగాని శ్రీనివాసరావు, తెల్లమేకల రాజేష్, ధీరజ్, వల్లెపు కుమార్, మాణ్యీరావు తదితరులు పాల్గొన్నారు.







సందడిగా జీఎంసీ సంక్రాంతి సంబరాలు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వ ర్యంలో ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవా రం ప్రజా ప్రతినిధులు, అధికారులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సన్నాయి మేళ తాళాలు, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల ఆట పాటలు, చిన్నా రులకు భోగిపళ్లతో ఎన్టీఆర్ స్టేడియం పండుగ శోభతో అలరారింది. ప్రత్యేక ఆకర్షణగా సంబరాల్లో ఎక్కువ మంది సంప్రదాయక దుస్తులు ధరించారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ జీఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలు కుటుంబసభ్యులందరినీ అలరిస్తాయని అన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రతి కుటుంబంలో భోగ భాగ్యాలు అందించాలని కోరు కున్నారు. అనంతరం జేకేసీ కాలేజి గ్రౌండ్‌లో విలేకరులు, జీఎంసీ ఉద్యోగుల టీంల క్రికెట్ మ్యాచ్‌లను కమిషనర్ టాస్ వేసి ప్రారంభించారు. సదరు పోటీల్లో జీఎంసీ కమిషనర్ టీం విజేతగా, ఉద్యోగుల టీం రన్నర్స్‌గా నిలిచాయి. సాయంత్రం సంబరాల్లో భాగంగా డప్పు వాయిద్యం, చెక్క భజన, తంబోలా, సంప్రదాయ వస్త్ర పోటీలు, కూచిపూడి, ఫోక్ డ్యాన్స్ ప్రదర్శనలను నగర ప్రజలు ఎంతో ఆసక్తితో పెద్ద సంఖ్యలో తిలకించారు. కార్య క్రమంలో డిప్యూటీ కమిషనర్లు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృత, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నిర్వహణ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కోడి పందాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, కమిషనర్ శ్రీనివాసులు


తాడు లాగుడు పోటీలో పాల్గొన్న నగరవాసులు

టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో గల పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని కంభంపాడు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త తిరుపతయ్య ఆదివారం సాయంత్రం మద్యం తాగి పాత గొడవల నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలకు ఫోన్ చేసి వివాదాస్పదంగా మాట్లాడారు. ఆ సమయంలో లేమల్లెలో కోడిపందేలు వద్ద ఉన్న టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి గుంటూరు వచ్చారు. తొలుత ఎంపీ శ్రీకృష్ణదేవరాయల కార్యాలయం వద్ద ఉన్నానని చెప్పడంతో క్కడకు వెళ్లారు. తరువాత మాజీ ఎమ్మెల్యే శంకరరావు కార్యాలయం వద్ద ఉన్నానని చెప్పాడు. దీంతో టీడీపీ కార్యకర్తలు రెండు ద్విచక్ర వాహనాలపై నలుగురు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు కార్యాలయం వద్దకు వచ్చి తిరుపతయ్య కోసం వాకబు చేయగా ఆయన ఆచూకీ లభించలేదు. ఇప్పుడు ఎక్కడున్నావ్ అంటూ తిరుపతయ్యకు ఫోన్ చేయగా ఆయన మరింత రెచ్చిపోయాడు. దీంతో టీడీపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఉన్న ఫ్లెక్సీలను చించి వేశారు. ఇది గమనించిన వాచ్‌మన్ మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు వద్ద సూపర్ వైజర్‌గా పని చేసే నరేంద్రకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో శంకరరావు ఇంటి వద్ద ఉన్న నరేంద్ర తన వెంట డ్రైవర్ కట్టిపోగు జగదీష్ తో పాటు మరో ముగ్గురిని తీసుకుని శంకర్రావు కార్యాలయం వద్దకు వచ్చాడు. అక్కడ ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. నంబూరు శంకర్రావు సూపర్‌వైజర్, అదేవిధంగా టీడీపీ వర్గీయులు ఇరువురికి గాయాలు అయ్యాయి. నల్లపాడు సీఐ వంశీధర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

• ఇజ్‌తిమా దువా చేసిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల కాలంలో కుంటుపడిన రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంలో అన్ని రంగాల్లో ముందడుగు వేసి, ప్రజలంతా సుభిక్షంగా ఉండాల ని అల్లాను ప్రార్థించినట్లు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. నంబూరులో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇజ్‌తిమా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తమ్ముడు పెమ్మసాని రవితో కలిసి ప్రార్థనలు చేశారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇజ్‌తిమాకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2లక్షల మంది హాజరయ్యారని, వారికి ఎక్కడా కష్టం లేకుండా చూసిన పారిశుధ్య కార్మికులకు, అధికారులకు, మత పెద్దలకు ఎమ్మెల్యే నసీర్ ధన్యవాదాలు తెలియజేశారు. ఇజ్‌తిమా ఏర్పాటుకు సహాయ, సహకారాలు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభు త్వం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే మూడు పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. కాగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే నసీర్ ఓ ప్రకటన ద్వారా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.


ఇజ్‌తిమాకు హాజరైన ఎమ్మెల్యే నసీర్, పెమ్మసాని రవి

సామినేని ఫౌండేషన్ సేవలు అభినందనీయం

• ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

గుంటూరు(తూర్పు), జనవరి 13(ఆంధ్రజ్యోతి): పేద, ప్రతిభ కలిగిన విద్యార్థులకు అండగా నిలుస్తున్న సామినేని ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. స్థానిక విద్యానగర్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీరింగ్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని అన్నారు. ప్రతిభ కలిగిన వారికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సామినేని నాగేశ్వరరావు, తుమ్మల రమాదేవి, సామినేని రవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న భాష్యం ప్రవీణ్


పోటీలను ప్రారంభిస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

మనోధైర్యం పెంచేందుకు క్రీడలు దోహదం

• రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), జనవరి 13(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల్లో మనోధైర్యం పెంచేందుకు క్రీడలు దోహదపడతాయని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా పారాస్పోర్ట్స్ అసోసియేషన్, జిల్లా క్రీడా సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లో క్రీడలకు ప్రాధాన్యం ఉంటుందని, ఈ అవకాశాల్ని సద్వియోగించుకోవాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వై శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పోటీల్లో 209 మంది క్రీడాకారులు పాల్గొనగా, 95 మంది రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డీ ఎల్లయ్య, పీ వెంకటేశ్వర్లు, బండారు దుర్గారావు, శ్యామ్‌బాబు, జీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు, శస్త్ర చికిత్సలు

గుంటూరు(తూర్పు), జనవరి 13(ఆంధ్రజ్యోతి): రామ్‌కీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్‌ల్యాండ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆస్పత్రిలో ఈనెల 17, 18వ తేదీల్లో ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థల ప్రతినిధి ఎంవీ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణ మొర్రి, గ్రహణం అంగుళీకం, కాలినగాయాలతో బాధపడే వారికి, చీలిక పెదవి, క్రానియో ఫేషియల్, అనోమాలిస్, పుట్టుకతో వచ్చే చేతి వైకల్యాలు, 12-14 ఏళ్ల మధ్య పిల్లలను ప్రభావితం చేసే ఇతర వైకల్యాలపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం బాధితులకు ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 99086 30301, 98482 41640 లలో సంప్రదించాలని సూచించారు.

నేడు అయ్యప్పస్వామి జ్యోతి కార్యక్రమం

గుంటూరు(తూర్పు), జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం శ్రీవాసవీ మణికంఠ సేవా భక్తబృందం ఆధ్వర్యంలో స్థానిక ఏలూరు బజారు, కోదండరామాలయం వద్ద అయ్యప్ప స్వామి జ్యోతి కార్యక్రమం జరుగుతుందని సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయం త్రం 6.05 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా గోదా రంగనాథస్వామి కల్యాణం

గుంటూరు(తూర్పు), జనవరి 13(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా భోగి పురస్కరించుకుని పలు ఆలయాల్లో గోదా రంగనాథ స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భోగి సందర్భంగా శ్రీకృష్ణుని అందంగా అలంకరించి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి చిన్నారులకు భోగి పండ్లను పోసి వేడుకగా జరిపారు. అంగరంగ వైభవంగా గోదా రంగనాయకస్వామి కల్యాణోత్సవం జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణనగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వ్యాపారవర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

• యేల్చూరికి తాడిశెట్టి మురళీ అభినందనలు

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): వ్యాపారవర్గాల సంక్షేమమే ధ్యేయంగా ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఎన్నికైన యేల్చూరి వెంకటేశ్వర్లు పనిచేయాలని మాజీ డిప్యూటీ మేయర్, టీడీపీ నేత తాడిశెట్టి మురళీమోహన్ సూచించారు. ఇటీవల చాంబర్ ఎన్నిక ల్లో గెలుపొందిన యే ల్చూరి వెంకటేశ్వర్లు ఆ ధ్వర్యంలో కాటన్ వ్యాపారుల తో పట్టాభిపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యేల్చూరి భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆ కాంక్షించారు. యేల్చూరి మాట్లాడుతూ వ్యాపారవర్గాల సమస్యల పరిష్కారం కో సం అందరి సహాయ సహకారాలతో మరింత కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ ఉపాధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్లు సంబరాసు వాసు, అన్నంరాజు సాయిరామ్, గుప్తా తదితరులున్నారు.


యేల్చూరిని సత్కరించి అభినందిస్తున్న తాడిశెట్టి మురళీ, వెచ్చా తదితరులు

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

• ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ లెనిన్‌బాబు


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

గుంటూరు(తూ ర్పు), జనవరి 13(ఆం ధ్రజ్యోతి): అఖిల భార త యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలను ఫిబ్రవరి 6నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు తెలిపారు. సోమవారం గుంటూరులో మహాసభలకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. సభల్లో పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బందెల నాసర్‌జీ, షేక్ సుభాని, జాన్సన్ బాబు, జంగాల చైతన్య, షేక్ వలి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.







వేడుకగా.. భోగి

భోగి మంటలు.. భోగిపండ్లు, రంగుల రంగవల్లులు.. బొమ్మల కొలువులు.. ఎగిరే గాలిపటాలు.. హరిదాసుల కీర్తనలు.. గంగిరేద్దుల ఆటలు.. ఘుమ ఘుమలాడే పిండి వంటలతో సంక్రాంతి పండక్కి స్వాగతం పలుకుతూ, వెలుగుల ఉత్తరాయణాన్ని ఆహ్వానించే భోగ భాగ్యాల భోగిని పల్లెలు, పట్టణాల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే పట్టణాలు, పల్లెల్లో ప్రధాన కూడళ్లతో పాటు ఇళ్ల ముంగిళ్ల లో భోగిమంటలు వేసి సంక్రాంతి సంబరాలను వేడుకగా సోమవారం ప్రారంభించారు. సామాన్య ప్రజలతో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు భోగి కార్యక్రమాలను వేడుకగా జరుపుకున్నారు. దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి కల్యాణోత్సవాలు నేత్ర పర్వంగా జరిగాయి. జిల్లా అంతటా సంక్రాంతి శోభ నెలకొంది.



- ఆలయాల్లో విశేష పూజలు
- శ్రీవారికి కల్యాణోత్సవాలు
- చిన్నారులకు భోగి పండ్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలో మొదటి రోజైన భోగిని అన్ని వర్గాల ప్రజలు కోలాహలంగా జరుపుకున్నారు. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వారు స్వగ్రామాల్లో మిత్రులు కుటుంబ సభ్యులతో కలసి భోగి మంటలు వేసి ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. పిండి వంటల ఘుమ ఘుమలు, బంధువులు, కుటుంబ సభ్యుల సందడితో పల్లెలు శోభిల్లాయి. కుల మతాలకు అతీతంగా రైతులు, వ్యవసాయ కూలీలు జరుపుకునే పండుగ కావడంతో సంక్రాంతి పర్వదినానికి అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారితో పాటు బంధువుల రాకతో గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. పల్లెల్లో ముగ్గుల పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించారు. భోగిమంటల అనంతరం దేవాలయాలకు భక్తులు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల ముందు ఒకరికొకరు పోటీ పడి భోగి ముగ్గులతో వాకిళ్లను అందంగా తీర్చి దిద్దారు. ఆ ముగ్గుల్లో గొబ్బెమ్మలను అలంకరించారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా గాలి పటాలను ఎగుర వేసి ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. చిన్నారులకు పెద్దలు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. భోగి పండుగ రోజు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారు జామునుంచి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో గోదాదేవి కళ్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణోత్స వాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సావాలను కనులారా తిలకించారు.


తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి మనోహర్


నరసరావుపేట పట్టణంలో భోగి మంటల వద్ద నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు


గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో భోగి మంటను వెలిగిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి కమిషనర్ పులి శ్రీనివాసులు.


యడ్లపాడులో భోగి మంటలు వేస్తున్న స్థానికులు


బాపట్ల విజయలక్ష్మీపురంలో భోగి వేడుకల్లో టీడీపీ నేతలు


మాచవరం మండలం వేమవరంలో హరిదాసుకి చిరు ధాన్యాలు వేస్తున్న చిన్నారులు


కొల్లిపరలో గ్రామంలో ఇంట ముంగిళ్లలో డూడూ బసవన్నల సందడి


మాచర్ల పట్టణంలోని 16వ వార్డులో భోగి మంటల వద్ద మహిళలు


వట్టిచెరుకూరులో భోగి మంటలు వేస్తూ ఆనందిస్తున్న స్థానికులు


బాపట్లలో క్షీర భావన్నారాయణ స్వామి దేవాలయం ఎదుట భోగిమంటలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


రొంపిచర్లలో భోగి మంటల కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

హోరాహోరీగా మంగళగిరి ప్రీమియర్ లీగ్

మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఉత్కంఠగా సాగుతున్న పోటీలు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మంగళగిరి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగున్న ప్రీమియర్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు విజయనగరం-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్నూలు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు 11.04 ఓవర్లలో 3 వికెట్ల నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది.

శ్రీకాకుళంతో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేయగా, శ్రీకాకుళం జట్టు 3 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. రెండు మ్యాచ్‌లలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారులకు బోగి వినోద్, కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పది వేల చొప్పున బహుమతిని అందజేశారు. ఈ పోటలకు సేల్, సక్కు, మార్కోరోస్, ఉషోదయ, వి-డిజిటల్ సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

నువ్వా.. నేనా..!



- యార్డు కార్యదర్శి పోస్టుకోసం పోటాపోటీ
- గ్రూపు-1 అధికారిణి రానున్నట్లు ప్రచారం
- కొనసాగేందుకు 'వినుకొండ' ముమ్మర ప్రయత్నాలు

గుంటూరు సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఎగుమతిలో ఆసియాలో నే అతి పెద్దదిగా పిలువబడే గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు కోసం గట్టిపోటీ నెలకొంది.ఈ పోస్టు కోసం ఉత్తరాంధ్ర కు చెందిన గ్రూపు-1 అధికారిణి ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆ పోస్టు లో ఉన్న వినుకొండ ఆంజనేయులు పరిస్థితి గందరగోళం గా మారింది. ఏడాది కి సుమారు వేల కోట్ల రూపాయలు పైబడి టర్నోవర్ కలిగిన గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు అంటే ఎప్పుడూ హాట్ కేక్ లా ఉంటుంది. ఈ పోస్టును దక్కించుకునేందుకు మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు చెయ్యని ప్రయత్నాలు అంటూ ఉండవు. ఉన్నత స్థాయి రాజకీయ నాయకుల దగ్గర నుంచి రాష్ట్ర అధికారుల దాయదక్షిణ్యాలు మెండుగా ఉంటేనే పోస్టు దక్కుతుంది. ఒక్క సీజన్ లో యార్డు కార్యదర్శి గా పనిచేసినా జీవితం సెటిల్ అవుతుందన్న ఆలోచన తో మార్కెటింగ్ ఉద్యోగులు ఇక్కడ పోస్టింగ్ కోసం నానా తంటాలు పడుతుంటారు.

ఒకరు అక్కడ.. ఒకరు ఇక్కడ

గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్న గ్రూపు-1 అధికారిణి ఉత్తరాంధ్ర లో ఉన్నత స్థాయి పోస్టు లో వున్నారు. అయితే సదరు అధికారిణి భర్త గుంటూరు జిల్లాలో కీలకమైన పోస్టు లో ఈ మధ్య కాలంలో నే నియమితులయ్యారు.భార్యాభర్తలు ఇరువురు జిల్లా అధికారులు కావటంతో ఒకే చోట ఉండేందుకోసం యార్డు కార్యదర్శి పోస్టు వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. సదరు అధికారిణి కుటుంబంలో కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం లో కీలకమైన స్థానంలో ఉన్నవారు వున్నారు. దాంతో ఆమె కు పోస్టింగ్ దరిదాపుగా ఖరారు అయినట్లు ప్రచారం జరుగుతోంది.

ఉండేందుకు యత్నాలు..

ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి గా వినుకొండ ఆంజనేయులు కొనసాగుతున్నారు. ఆయనకు ఇంకా 11 నెలలు మాత్రమే సర్వీసు ఉంది. అప్పటివరకు ఆ పోస్టు లో కొనసాగేందుకు ఆయన ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.గ్రూపు-1 అధికారిణి నియామకంలో తీవ్ర జాప్యం జరగడంలో ఆంజనేయులు ప్రయత్నాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఆంజనేయులు కు మద్దతుగా ఒక సామాజిక సంఘం ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో కొన్ని పోస్టు లు కూడా పెట్టటం జరిగింది. అయితే వచ్చే గ్రూపు-1 అధికారిణి కూడా అదే సామాజిక వర్గానికి చెందిన వారని తెలియటం తో కొందరు నాయకులు వెనక్కి తగ్గినట్లు సమాచారం.

నేతల జోక్యం..

యార్డు కార్యదర్శి నియామక వ్యవహారంలో కొందరు నేతలు జోక్యం చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆంజనేయులుకు అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. గ్రూపు- 1 అధికారిణికి అనుకూలంగా కూడా కొందరు రాష్ట్ర నేతలు రంగ ప్రవేశం చేసినట్లు తెలిసింది. వారి చొరవతో నే ఆమె నియామకం దరిదాపుగా ఖరారు అయినట్లు అంతా అనుకున్నారు.అధికారిణి కోసం ప్రయత్నాలు చేస్తున్న రాష్ట్ర నేతలు గుంటూరు కు చెందిన కీలకమైన ప్రజాప్రతినిధులతో కూడా చర్చించినట్లు తెలుస్తోంది.

ఎప్పుడూ అంతే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు కోసం మినీ యుద్ధం జరిగింది. ఆ పోస్టు లోకి వచ్చేందుకు ఆ శాఖలోని అన్ని స్థాయిల అధికారులు ఉన్నత స్థాయిలో పావులు కదుపుతూ వచ్చారు. చివరకు ఎవరు కమిషనర్‌కు దగ్గరగా ఉంటారో వారికే బాధ్యతలు అప్పగించడం జరిగింది. అయితే ఒక సెక్రటరీకి మాత్రం నేతల చలవతో యార్డు పోస్టు మళ్ళీ మళ్ళీ దక్కింది. ఆ తర్వాత జరిగిన అక్రమాల్లో వీళ్లంతా ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు తేల్చారు. మొత్తం మీద యార్డు కార్యదర్శి పోస్టు వ్యవహారం ఏమి జరుగుతుందో వేచి చూడాల్సిందే.

అలరించిన బొమ్మల కొలువు!



ఆసక్తిగా వీక్షించిన మహిళలు

బాపట్ల,జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : బాపట్లపట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో పాపినేని వారి ఇంట బొమ్మలు కొలువు తీరాయి. అందమైన బొమ్మల అలంకారం నాలుగు దశాబ్దాలుగా ప్రతి ఏటా ఇక్కడ నిర్వహిస్తున్నారు. విశేషంగా ఆకర్షిస్తున్న బొమ్మల కొలువు చూడముచ్చటగా సింగారించుకున్న అలంకారం.... బాపట్లలో కనువిందు చేస్తున్నసింగారం. ప్రతి ఏటా పాపినేని వారి ఇంట కొలువు తీరే అంబరం రమణీయత ఉట్టిపడే అద్భుత సంబరంగా మారింది. వేలాది బొమ్మలు సేకరించి ఆ ఇంట ప్రదర్శించటం ఆనవాయితీగా వస్తున్నది. సంక్రాంతి పర్వదినాలలో ప్రత్యేక ఆకర్షణీయమైన బొమ్మల కొలువు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. సంక్రాంతిలో కనిపించే ఈ సంస్కృతికి శ్రీకారం చుట్టారు. బాపట్లకు చెందిన పాపినేని ధనలక్ష్మీ కుటుంబం 1984 నుంచి వివిధ రకాల బొమ్మలు సేకరించటం మొదలు పెట్టారు. విహారయాత్రకు వెళ్ళిన ప్రతిసారి కొన్నిబొమ్మలు తీసుకురావటం, ఇంట్లో ప్రదర్శనగా ఉంచటం చేస్తున్నారు. ఒకప్పుడు 10 బొమ్మలతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రస్తుతం వేల బొమ్మలు కొలువుతీరాయి. ప్రకృతి రమణీయతను ఉట్టిపడే అందాలు, ఆరుగాలం శ్రమించే అన్నదాతలు, అంధంగా కనిపించే రమణీయ దృశ్యాలు, దేవాలయాలు, దేవుళ్ళ బొమ్మలు, దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఉన్న సుప్రసిద్ధ పర్యాటక కేంద్రాలు, పల్లె వాతావరణం ప్రతిబింబించేలా దృశ్యాలు, ముఖ్యంగా మత సామరస్యాన్ని చాటి చెప్పే అందమైన బొమ్మలు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. ప్రతి ఏటా భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలలో బొమ్మలు ప్రదర్శిస్తున్నట్లు ధనలక్ష్మీ తెలిపారు.

ఈ బొమ్మల కొలువుని కుటుంబ సభ్యులంత కలిసి వేడుకగా జరుపుకుంటున్నారు. దీనిని తిలకించేందుకు పరిసరప్రాంత మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. 15వ తేది వరకు బొమ్మల కొలువు అందుబాటులో ఉంటుందని పాపినేని ధనలక్ష్మీ, పాపినేని రాధాకృష్ణ, పాపినేని నాగదేవి ప్రసాద్‌లు తెలిపారు. సాయంత్రం 6 గంటలు నుంచి 10 గంటల వరకు బొమ్మల కొలువు దర్శించవచ్చని అన్నారు.


బాపట్ల పట్టణంలోని పాపినేని వారి ఇంట కొలువు తీరిన బొమ్మల కొలువు



గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమడెల్టాకాల్వకు 1818 క్యూసెక్కులు..

దుగ్గిరాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1818 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 11.2 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హై లెవెల్ ఛానల్‌కు 80 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 130, తూర్పుకాల్వకు 190, పశ్చిమ కాల్వకు 60, నిజాంపట్నం కాల్వకు 50, కొమ్మమూరుకాల్వకు 786 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం

మంగళగిరి సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ముగింపు సందర్భంగా పెదవడ్లపూడి గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో శ్రీ గోదాదేవి కల్యాణ మహోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. అన్నే శివశంకర ప్రసాద్, లతారాణి దంపతులు కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ గావించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, మాజీ సర్పంచ్‌లు అన్నే చంద్రశేఖర్, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు మాదల రమేష్‌బాబు, దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ కుర్రా శ్రీనివాసరావు, సభ్యులు పాదర్తి వంశీకృష్ణ, లింగినేని సుబ్బారావు, యేళ్ల స్పందన తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికే గోకులాలు

ఫిరంగిపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం మినీ గోకులాల నిర్మాణాలు చేపట్టిందని టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని కండ్రిక గ్రామంలో సోమవారం రైతు చెవిటిగంటి నరసింహారావు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రూ 2.30 లక్షల వ్యయంతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మండవ నరసింహారావు, పసల తోమాస్, ఆరే పున్నారెడ్డి, సర్పంచ్ నలజర్ల అప్పయ్య, డీసీ అధ్యక్షులు నలజర్ల రవి కుమార్, మందాళ్ళ రామిరెడ్డి, కటికల అప్పారావు, చెవిటిగంటి కోటేశ్వరరావు, వీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

కుంచనపల్లి చర్చిలో మేరిమాత మహోత్సవం

తాడేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని కుంచపల్లి ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో సోమవారం మేరిమాత మహోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు హాజరయ్యారు. స్థానిక మత పెద్దలు, చర్చి ఫాదర్ ఆయనకు ఆశీర్వనాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కానుగోలు కోటేశ్వరరావు, మురళీకృష్ణ, తోటకూర ప్రవీణ్, రాజు, వినోద్, సంఘస్థులు, టీడీపీ, జనసేన నేతలు చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు


దుగ్గిరాలలో దోస్త్ ఆధ్వర్యంలో వేసిన భోగిమంటలు చుట్టు జానపద గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థినులు


దోస్త్ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

● వేడుకగా భోగి పండుగ
● చిన్నా, పెద్దా అంతా కలిసి సందడి
● వివిధ గ్రామాల్లో గ్రామీణ క్రీడల నిర్వహణ
● ఆలయాల్లో మహిళల పూజలు

దుగ్గిరాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం దుగ్గిరాలలో దోస్త్ ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు జరిగిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామంలో రైలుపేట బోసు బొమ్మసెంటర్ నుంచి బంగ్లా ఆవరణవరకూ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా గంగిరెద్దులు, హరిదాసులు, ఎడ్లబండితో ఊరేగింపు నిర్వహించారు. మహిళలకు వంటలు ముగ్గుల పోటీలు, బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. వివిధ కళాశాలలో భోగి మంటలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో కంఠంరాజు కొండూరు కేజీ హైస్కూల్ ఛైర్మన్ పోలవరపు రాఘవరావు, గూడూరు వెంకట్రావు, తాడిబోయిన రామస్వామి, తహసీల్దార్ ఐ. సునీత, మిక్కిలినేని గాంధీ, జంపాల సుబ్బారావు, చాగర్లమూడి శ్రీనివాసరావు, గద్దె శ్రీనివాస్, వి. నరసింహారావు, జె. శివకృష్ణ, వాసిరెడ్డి సుధాకర్, ప్రిన్సిపాల్ కొత్త గిరిధరరావు, కొండపనేని రవీంద్రరావు, కొంగర సుధీర్‌బాబు, గ్రామస్తులు మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు, (ఆంధ్రజ్యోతి): భోగి పండుగ సందర్భంగా సోమవారం తెల్లవారు జామున మండల వ్యాప్త గ్రామాల్లో భోగి మంటలు వేశారు. ఇప్పటికే సుదూర ప్రాంతాలతో పాటు ఇతర దేశాల నుంచి తరలి వచ్చిన బంధువులతో ఊరంతా సందడిగా మారింది. సీఐ రమా నాయక్ పర్యవేక్షణలో ఎస్ఐ సుబ్బారావు, మండల వ్యాప్త గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ కోడి పందేలు, జూదం వంటివి లేకుండా తగు చర్యలు తీసుకున్నారు.

ఫిరంగిపురం, (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద స్థానిక టీడీపీ శ్రేణులు భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు కటికల అప్పారావు, పసల తోమాస్, కోటా శేషు, కొలగాని కొండలరావు, వెంకటేశ్వరరావు, బాబు, కిరణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు,(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ ఆటల పోటీలు ఏర్పాటు చేయటం అభినందనీయమని డాక్టర్ కొల్లా హేమంతి దేవి అన్నారు. స్థానిక కొల్లా వెంకయ్య లైబ్రరీ వద్ద వెంకయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంతిదేవి మాట్లాడుతూ ఆటలు మనిషికి మానసిక, శారీక ఆరోగ్యాన్నిస్తాయని, టీవీ, సెల్ ఫోన్లు, వీడియో గేమ్స్ వంటివి గ్రామీణ కళను మింగేస్తున్నాయన్నారు. అందరూ కలిసే ఆటలు, సరదాగా గడిపే సన్నివేశాలు కనుమరుగైపోతున్నాయని అన్నారు. అనంతరం చిన్నారులు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు, వీరయ్య చౌదరి, మోహనరావు, గోపి పాల్గొన్నారు.

మండల పరిధిలోని ఆయా గ్రామాలో సోమవారం భోగి పండుగను వేడుకలగా నిర్వహించారు. తెల్లవారుజామున గ్రామ కూడళ్లలో భోగి మంటలు వేశారు. భోగి పండుగ పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సాంప్రదాయ దుస్తులలో సాయంత్రం బొమ్మల కొలువులు నిర్వహించి చిన్నారులకు భోగి పళ్ళుపోసి ఆశీర్వదించారు.


ఫిరంగిపురంలో ఎన్టీఆర్ బొమ్మ వద్ద భోగి మంటలు వేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

వర్గీకరణ వ్యతిరేక ఫిర్యాదులను తిరస్కరించాలి

మంగళగిరి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇప్పటివరకు స్వీకరించిన ఫిర్యాదులను తిరస్కరించాలని ఎమ్మార్పీఎస్ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చిలువూరు నాగరాజు డిమాండ్ చేశారు. మంగళగిరి ఐబీఎస్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు కోర్టు తీర్పుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌పైన, ఫిర్యాదిదారులపై కోర్టు ధిక్కారం కేసులు నమోదు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏక సభ్య కమిషన్‌ను నియమించిందని, ఈ కమిషన్ అన్ని జిల్లాల పర్యటన తుది దశలో వుందని చెప్పారు. సుప్రీం తీర్పుకు లోబడి విధులు నిర్వహించాల్సిన కమిషన్, అందుకు విరుద్ధంగా ఫిర్యాదులు స్వీకరించడం కోర్టు ధిక్కారమేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కళ్యాణం

పెదనందిపాడు, జనవరి 13: స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాస ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం గోదా దేవి రంగనాధ స్వాముల కళ్యాణం నిర్వహించారు. అర్చకులు వేదాంత అనంతాచార్యులు భాగవతల లక్ష్మీనారాయణ చార్యులు స్వామి వారికి కళ్యాణ నిర్వహించి విశేష పూజలు నిర్వహించారు.



జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

● ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించిన డీఎస్పీ మల్లికార్జునరావు

వట్టిచెరుకూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని వింజనంపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. డీఎస్పీ మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా శారీరక దృఢత్వానికి, స్నేహపూర్వక వాతావరణానికి ఎంతగానో దోహద పడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇలాంటి పోటీలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం నిర్వహించిన పోటీల్లో నాలుగు టీమ్‌లు పాల్గొన్నాయి.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ మల్లికార్జునరావు

పోటీలను తిలకించేందుకు గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో పరిసర గ్రామాల నుంచి వచ్చి ఆసక్తిగా తిలకించారు. గ్రామస్థులు క్రీడాకరులకు తగిన ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ వెంట సీఐ రమా నాయక్ ఉన్నారు.

వైభవంగా శివ ముక్కోటి వేడుకలు

మంగళగిరి సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శివ ముక్కోటి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. బృంగి వాహనంపై గంగా భ్రమరాంబ సమేతుడైన మల్లేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవానికి మాజేటి లక్ష్మీనరసింహ మూర్తి, లలిత దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో శివాలయం ప్రధాన అర్చకుడు తెలిదేవరపల్లి మహేష్‌కుమార్‌శర్మ, బోగి కోటేశ్వరరావు, డాక్టర్ వంశీకృష్ణ, దీప, కొల్లి బాబూరావు, అద్దంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పందేటి సాంబశివరావు, జూట్రు ఏడుకొండలు, గండికోట రాజారావు, వీరరాఘవులు, సోములు తదితరులు పాల్గొన్నారు.




ఉండవల్లిలో రైతు సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న శివశంకర్ తదితరులు

విద్యుత్ బిల్లుల దహనం

తాడేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా సోమవారం తాడేపల్లి మండలం, పట్టణంలో రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు కార్యకర్తలు విద్యుత్ బిల్లులు దహనంచేశారు. ఉండవల్లిలో నులకపేటలో, కుంచనపల్లి, గాంధి బొమ్మ సెంటర్‌లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యుత్ బిల్లులు పెంచబోమని ఎన్నికల్లో చెప్పి అధికారంలోకి వచ్చాక విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంచిందని నేతలు ఆన్నారు. కార్యక్రమాలలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకర్, కె జగదీశ్వరరెడ్డి, ఆర్వి రాఘవయ్య, పల్లె కృష్ణ, బూరగ వెంకటేశ్వర్లు, అమ్మిశెట్టి రంగారావు, కాజ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాలపర్రు, నాగుల పాడులో సీపీఎం నేతలు విద్యుత్ బిల్లులను భోగి మంటలో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు మాట్లాడుతూ విద్యుత్ సర్దుపాటు చార్జీల పేరుతో ప్రజల మీద వేస్తున్న ఆర్థిక భారాన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ బిగింపు కార్యక్రమాన్ని వెంటనే ఆపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు ఎస్ కె మహబూబ్ సుభాని, చెట్టుపలి జెరీష్ బాబు, పోల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి,(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పలుచోట్ల బోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దగ్గం చేశారు. స్థానిక సీపీఎం శాఖల ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు ఎస్.గణేష్, వెంకటేష్, గోవింద్, నాగేంద్రబాబు, శంకర్, ప్రసాద్, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ,(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ వామపక్ష పార్టీ నాయకులు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి దహనం చేశారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు మాట్లాడుతూ తక్షణమే విద్యుత్ ఛార్జీల పెందులను ఉపసంహరించుకొని ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో పలువురు వామపక్ష పార్టీ నాయకులు పాల్గొన్నారు.

17న ధర్నాను జయప్రదం చేయాలి

తాడేపల్లి టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకర్ పిలుపునిచ్చారు. తాడేపల్లి మేకా అమరారెడ్డిభవన్‌లో సోమవారం రైతుసంఘం మండల అధ్యక్షుడు ఎం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమలో రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు




తక్కెళ్ళపాడులో చంద్రశేఖర స్వామి వారి ఆర్ధ్ర మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా చంద్రశేఖర స్వామి ఆర్ధ్ర మహోత్సవాలు

పెదకాకాని, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం తక్కెళ్ళపాడులో గంగా భ్రమరాంబ సమేత చంద్రశేఖర స్వామి వారి 82వ వార్షిక ఆర్ధ్ర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం గుంటూరు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం, భస్మాభిషేకం వైభవంగా జరిగాయి. ఈ నెల 17వ తేదీ వరకు స్వామి వారి ఉత్సవాలు వైభవంగా జరిపించనున్నారు. ప్రతిరోజు చంద్రశేఖర స్వామి వారికి నిత్య కళ్యాణం, అమ్మవారికి కుంకుమ పూజ భక్తుల సామూహికంగా నిర్వహించనున్నారు.


కుటుంబ సమేతంగా పెదకాకాని మల్లేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ దంపతులు

వైభవంగా ఆరుద్రోత్సవం

పెదకాకాని, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆరుద్రోత్సవం వైభవంగా భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామిని భక్తులు ఉత్తర ద్వారంలో దర్శించుకున్నారు. మల్లేశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక మహా రుద్రాభిషేకంతో అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల గ్రామోత్సవం వైభోపేతంగా నిర్వహించారు.

ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ దంపతులు

పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దంపతులు సోమవారం దేవస్థానంను దర్శించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గోగినేని లీలాకుమార్, ఆలయ అర్చకస్వాములు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడమ స్వాగతం పలికారు. భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకం, అమ్మవారి కుంకుమ పూజలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామివారి శేష వస్త్రంతో వారిని ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ సత్కరించారు.

● తెనాలి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయాల్లో సోమవారం శివ ముక్కోటి ఘనంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని శివాలయాలలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. తొలుత ప్రత్యేక పూజల అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ద్వాదశ ప్రదక్షిణలు, గ్రామోత్సవం నిర్వహించారు. గంగానమ్మపేట పాత శివాలయంలో, మారీసుపేట చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో, రామలింగేశ్వరపేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో, చినరావూరు సోమేశ్వరాలయంలో ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకుని అభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించారు. ఈవో రమణకుమారి, ఈవో రమణకుమారి, ఎస్‌బీ శివ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


● పొన్నూరు టౌన్, చేబ్రోలు: పొన్నూరు - చేబ్రోలు మండలాల్లో సోమవారం ఆరుద్రోత్సవం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఆరుద్ర ఉత్సవాన్ని పురస్కరించుకొని శైవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆరుద్రోత్సవం సందర్భంగా ఆలయాల్లోని మూలవిరాట్లకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని సాక్షి భావనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరి ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకాల అనంతరం స్వామివారి ఉత్సమూర్తులను నంది వాహనంపై ప్రతిష్ఠించి నగరోత్సవం నిర్వహించారు.

● పొన్నూరు టౌన్: ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రంగనాయక సమేత శ్రీగోదా కల్యాణం భక్తి శ్రద్ధలతో జరిగింది. స్వర్ణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గోదా కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు జరిపారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామివారి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి కల్యాణ క్రతువులను నిర్వహించారు. అలాగే పలు ఆలయాల్లో గోదా కల్యాణం నిర్వహించారు. తెలగపాలెం కోదండ రామాలయంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.


తెనాలి: గోదా రంగనాథుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

● తెనాలి అర్బన్: వీఎస్ఆర్ కళాశాల రోడ్డులో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలలో గోదాదేవి రంగనాథుల కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. శరణగతి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 20 రోజులుగా ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నరేంద్ర రామానుజ దాసస్వామి ఆధ్వర్యంలో జరిగిన కల్యాణంలో 108 మంది దంపతులు పాల్గొన్నారు. ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ చందు రామారావు, కామేశ్వరరావు, శ్యామసుందరరావు, శివనాగమల్లేశ్వరరావు తదితరులు కల్యాణంలో పాల్గొన్నారు.

● కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భోగి పండుగ సందర్భంగా స్వామికి వేకువజామున విష్వక్సేనపూజ, గోక్షీరంతో స్నపన వంటివి ప్రత్యేక పూజలు చేశారు. గజేంద్ర మోక్షంలో విష్ణు మూర్తి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గోదాదేవి శ్రీరంగనాథునిలో ఐక్యమైన పవిత్ర దినం భోగిరోజు కావడంతో పండితులు గోదాదేవి కల్యాణం నిర్వహించడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అదేవిధంగా మండలంలోని గ్రామాల్లోని మహిళలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రంగురంగుల రంగవల్లులను ముంగిళ్లలో తీర్చిదిద్దారు. దీంతో వీధులు శోభాయమానంగా విలసిల్లాయి. రంగవల్లుల నడుమ గొబ్బెమ్మలను ఉంచి భక్తి గీతాలు ఆలపించారు.


దుర్గాప్రసాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

ప్రజ్వలిత వ్యవస్థాపకుడు దుర్గాప్రసాద్‌కు ఘన నివాళి

తెనాలి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సాహిత్య సంస్థ ప్రజ్వలిత వ్యవస్థాపకుడు నాగళ్ల దుర్గాప్రసాద్ వర్థంతి సోమవారం నిర్వహించారు. బుర్రిపాలెం రోడ్డులోని ఆయన విగ్రహానికి కళాకారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు మాట్లాడుతూ, సంఘానికి భవనం నిర్మించడమే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు సాహితీ సదస్సులు నిర్వహించారు. కళలను, కళాకారులను ప్రోత్సహించారని, సాహిత్యరంగానికి ఆయన లేనిలోటు తీర్చలేనిదన్నారు. బి. వెంక ట్, వజ్రాల రామలింగాచారి, రాంబాబు, రామరాజు, సీతారామయ్య, రాజు, దుర్గాప్రసాద్, బెన్‌హర్, బి.కృష్ణ, అబ్రహం లింకన్ పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ రోడ్డులో, గాంధీ ఆశ్రమంలో పేదలకు దుర్గాప్రసాద్ సతీమణి రాజేశ్వరి అన్నదానం చేశారు.

సంక్రాంతి సంబరాలు ప్రారంభం

కొల్లిపర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోగి మంటలు, రకరకాల రంగవల్లులు ... పిల్లలకు భోగి పండ్లు.. డూడూ బసవన్నలు.. హరిదాసు కీర్తనల నడుమ మండల ప్రజలు సంక్రాంతి పండుగకు ఘనంగా స్వాగతం పలికారు. భోగిని పురస్కరించుకుని సోమవారం మండలంలోని గ్రామాల్లో వేకువ జామునే పలు ప్రాంతాల్లో భోగి మంటలు వేశారు. మహిళలు రంగవల్లులతో ముంగిళ్లను తీర్చిదిద్దడంతో వీధులు శోభాయమానంగా మారాయి. రంగవల్లుల నడుమ గొబ్బెమ్మలు ఉంచి భక్తి గీతాలు ఆలపించారు. పలుచోట్ల శ్రీకృష్ణునికి, చిన్నారులకు భోగిపండ్లు పోసి ముత్తయిదువులు ఆశీస్సులు పొందారు.

● పొన్నూరు టౌన్ (చేబ్రోలు): పొన్నూరు - చేబ్రోలు మండలాల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. భోగి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. భోగి రోజు తెల్లవారుజామున రెండు మండలాల్లో పలు కూడళ్లలో భోగి మంటలు వేసి చిన్నారులు, పెద్దవారు కోలాహలంగా గడిపారు. భోగి పండుగను పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం బొమ్మల కొలువులు నిర్వహించారు. చిన్నారులకు భోగిపళ్ళు పోసి ఆశీర్వదించారు.

● తెనాలి రూరల్: సోమవారం భోగి పండుగను వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పార్టీ శ్రేణులతో కలిసి భోగి మంటలు వెలిగించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా జగనన్న కాలనీల పేరు మార్పు చేస్తూ విడుదలచేసిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుమారుస్తూ తీసుకువచ్చిన జీవో ప్రతులను శివకుమార్, పార్టీ శ్రేణులతో కలిసి భోగి మంటల్లో వేసి దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.


భోగి మంటలు వెలిగిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

● పెదకాకాని: ఉప్పలపాడులో స్థానిక పెద్దలు, మెగా గణేష్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా సోమవారం జరిగాయి. సంబరాల్లో భాగంగా ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 40 మంది పాల్గొన్నారు. సాయంత్రం చిన్నారులకు స్లో సైకిల్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దంతాల అనిల్, పల్లెంపాటి సాంబశివరావు, పసుపులేటి మహేష్, గంగిశెట్టి గోవర్ధన్, పోలిశెట్టి కిరణ్, షేక్ నూరుల్లా, మున్నంగి జగదీష్ పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: పట్టణ ప్రజలు సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు పాల పొంగు, చెరుకుగడలు గుర్తు చేసే రకరకాల రంగులతో రంగవల్లులు వేశారు. వేకువజామున ప్రతివీధిలో భోగి మంటలు వేశారు. భోగి మంటలలో పాత వస్తువులు, ఆవుపిడకలు, ఆవు నెయ్యి సమర్పించారు. కొత్తపేట అష్టలక్ష్మి ఆలయంలో పిల్లలకు అర్చకులు భోగిపళ్లు పోశారు. పలు ఆలయాలలో భక్తులు పూజలు జరిపించుకున్నారు. గంగానమ్మపేటలోని సుందరయ్యవీధిలో స్థానికులు భోగి మంటలతో సందడి చేశారు. వైకుంఠపురంలో శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి సంక్రాంతి పండుగ పురస్కరించుకుని విద్యుత్ దీప కాంతులతో వెలుగొందింది. గోదాదేవి, రంగనాధ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కె.సాయిబాబు, ఈవో అనుపమ, అర్చకులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

● కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో శ్రీకళానిలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. డాక్టర్ సి.నారాయణ రెడ్డి స్మారక కళా ప్రాంగణంలో గ్రామ పెద్దలు కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, జొన్నల అమ్మిరెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. మోహినీ భస్మాసుర నాటిక, విజేతలు బాలల సాంఘిక నాటకం, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారు నిర్వహించిన విడాకులు కావాలి నాటిక పలువురిని అకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీకళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆరిమండ పెదనాగిరెడ్డి, గ్రామ పెద్దలు వంగా లక్ష్మారెడ్డి, కొండా శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొల్లిపర: మోహినీ భస్మాసుర నాటికలో సన్నివేశం

రైతుల మోములో ఆనందాన్ని నింపాం: మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకునే సంక్రాంతి పండుగ వేళ రైతుల మోములో ఆనందాన్ని నింపామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ భోగి మంటలను వెలిగించి ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరులతో మంత్రి మనోహర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో పంటల సాగుకు ఇబ్బందులు పడుతూ నిస్సహాయ స్థితిలో ఉన్న రైతులకు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి భరోసాగా నిలిచిందన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు పెండింగ్‌లో ఉన్న బకాయి సొమ్ము రూ.1674 కోట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో తక్షణమే విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిగా ఈ ఏడాది సాగు చేపట్టిన రైతులకు ఎక్కడా కూడా చిన్న సమస్య కూడా రాకుండా వారికి అండగా నిలిచామన్నారు. ఇప్పటివరకూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.6830కోట్ల రూపాయల ధాన్యాన్ని రైతుల వద్ద కొనుగోలుచేసి దాదాపుగా 94శాతం వారి ఖాతాల్లో జమచేయడం జరిగిందని గుంటూరు జిల్లాలో గత ప్రభుత్వంలో కేవలం 4000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే కూటమి ప్రభుత్వం సుమారు 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుందన్నారు. తొలుత పార్టీ కార్యాలయంలో జనసైనికులు, వీర మహిళలు ఏర్పాటుచేసిన సంబరాలను తిలకించి డూడూ బసవన్నల ప్రదర్శనను సంగీతాన్ని ఆలకించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ సేవా సమితి సమావేశం

తెనాలి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చెంచుపేటలోని చావాస్ గ్రాండ్ కల్యాణ మండపంలో సోమవారం కాకతీయ సేవా సమితి సమావేశం నిర్వహించారు. ముగ్గుల పోటీలు, భోగి మంటలు, పందెం కోళ్లతో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెలగపూడి గోపాలకృష్ణ, బెజవాడ వెంకట్రావు, రవికుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, నన్నపనేని సుధాకర్, ఈదర వెంకటపూర్ణచంద్ పాల్గొన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆవుల దశరధ రామయ్య, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, అనిత, సరళ, కృష్ణవేణి పర్యవేక్షించారు.

18న వీఎం రంగా విగ్రహావిష్కరణ

తెనాలి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ మాజీ ఎమ్మెల్యే దివంగత వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ ఈ నెల 18న కఠెవరంలో జరుగుతుందని ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. మారీసుపేటలో సోమవారం విగ్రహావిష్కరణ కరపత్రాలను ఆవిష్కరించారు.

నిత్యావసరాలు పంపిణీ

తెనాలి, మారీసుపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నందులపేటకు చెందిన నిరుపేద భాషా కుటుంబానికి హెల్పింగ్ సోల్జర్స్ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు ఇనయతుల్లా ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులను అందజేశారు. దాతల సహకారంతో రూ.5వేలు విలువచేసే నిత్యావసరాలను మందులకు నగదును ఇనయతుల్లా అందించామన్నారు.

హరినామ సంకీర్తన గానం

తెనాలి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో సోమవారం హరినామ సంకీర్తన గానం చేశారు. హరినామ సంకీర్తన బృందం ఆధ్వర్యంలో మూడు గంటల పాటు పలు కీర్తనలు ఆలపించారు. పెరవలి వంశీకృష్ణ, అందె రాజేశ్వరి, రత్నకుమారి, దుర్గామల్లేశ్వరి, మాధవి గానం చేశారు.

తెలుగుజాతి ఆరాధ్య దైవం ఎన్టీఆర్

● మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

పొన్నూరు టౌన్, జనవరి 13: తెలుగు జాతి ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పొన్నూరు మండలం పెదపాలెంలో సోమవారం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, మాజీమంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరిల విగ్రహావిష్కరణ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు సేవా కేంద్రం సిమెంట్ రోడ్లు మాజీ మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ పేదవారికి ఎన్టీఆర్ దైవం లాంటి వారన్నారు. దేశంలో సంస్కరణలకు ఆద్యం పోసింది ఎన్టీఆర్ అన్నారు. పేదలకు పక్కా ఇల్లు నిర్మించిన ఘనత ఎన్టీఆర్‌దన్నారు. అలాగే సామాజిక పింఛన్లకు ఆద్యుడు ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. అలాగే మాజీమంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి సంగం డెయిరీ ద్వారా పాల రైతుల సంక్షేమానికి పాటుపడ్డారని కొనియాడారు. అలాంటి మహనీయుల విగ్రహ ఆవిష్కరణలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్ యుగ పురుషుడు మాత్రమే కాకుండా విలక్షణ వ్యక్తిత్వం ఉన్న మహనీయుడు అన్నారు. ఎన్టీఆర్‌తో ఉన్న అనుబంధాన్ని మననం చేసుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎన్టీఆర్, తన తండ్రి వీరయ్య చౌదరి విగ్రహాల ఆవిష్కరణ చేపట్టిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. యువత మాతృభాష తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ యుగపురుషుడు ఎన్టీఆర్ అన్నారు. ప్రజల కష్టాలను చూసి చెల్లించి ప్రజా సంక్షేమ పాలనకు నాంది పలికారన్నారు. అలాంటి ఎన్టీఆర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఐఆర్ఎస్ అధికారి బండ్ల ప్రసాద్, తెలంగాణ ఎస్పీ ధూళిపాళ్ళ శ్రీనివాస్, స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఎన్టీఆర్, డీవీసీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి

నందివెలుగులో టీడీపీ కార్యకర్త ఇంటి ముందు గోడ తొలగింపు



తెనాలి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివెలుగులో టీడీపీ కార్యకర్త షేక్ అక్బర్ వలి ఇంటి ముందు నిర్మించిన గోడను సోమవారం తొలగించారు. మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ షేక్ సిలార్ జానీబాషా, వైసీపీ యువజన నాయకుడు కలిసి టీడీపీ కార్యకర్త షేక్ అక్బర్‌వలి ఇంటిముందు గోడ నిర్మించిన విషయం విదితమే. దీంతో అధికారులు కట్టిన వారితోనే గోడను తొలగింపజేశారు. కలిసిమెలిసి ఉండాలని హితవు పలికారు.

ఆకట్టుకున్న 'మట్టి మనిషి'

తెనాలి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన మట్టి మనిషి నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన మిత్ర క్రియేషన్స్ కళాకారుల బృందం ఈ నాటకాన్ని ప్రదర్శించారు. వాసిరెడ్డి సీతాదేవి నవల మూలం నుంచి వల్లూరు శివప్రసాద్ నాటక రచన చేయగా, ఎస్ఎం భాషా దర్శకత్వం వహించారు. మూడు గంటల పాటు సాగిన ఈ నాటకం మట్టికి మనిషికి సామాజికంగా ఉండే సంబంధాలు వాటి మంచి చెడ్డలు, ఆ సంబంధాల్లోని మార్పులను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. 1970లో రచించిన నవల ఉస్మానియా యూనివర్శిటీలో పాఠ్యాంశంగా కూడా ప్రవేశపెట్టారు. ఈ నవలను 14 భారతీయ భాషల్లోకి నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా అనువదించి ప్రచురించింది. తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో మట్టి మనిషి నవల 13వ రచనగా పేరు పొందింది.


మట్టి మనిషి నాటకంలోని సన్నివేశం



వైకుంఠ రథంను అందజేసిన అంగలకుదురు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, గ్రామ ఉపసర్పంచ్ నాగభూషణం

వాహనం వితరణ అభినందనీయం

● గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి

తెనాలి, మారీసుపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అంతిమయాత్రకు వినియోగించుకునేలా మహాప్రస్థాన వాహనాన్ని వితరణ చేసిన అంగలకుదురు అసోసియేషన్ హైదరాబాదు సభ్యుల కృషి అభినందనీయమని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అంగకుదురులో హైదరాబాదులో స్థిరపడిన గ్రామస్థులు అంగకుదురు అసోసియేషన్ హైదరాబాదు అనే సంస్థను ఏర్పాటుచేసి తమ గ్రామానికి రూ.8లక్షలతో వైకుంఠ రథాన్ని గణేష్ యూత్ కన్వీనర్ టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణంల చేతుల మీదగా గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా వీరవల్లి మురళి మాట్లాడుతూ తాము పుట్టిపెరిగిన గ్రామం కోసం ఆలోచనచేసి అంగకుదురు అసోసియేషన్ హైదరాబాదు అధ్యక్షుడు అలపర్తి సాంబశివరావు, అసోసియేషన్ సభ్యులతో కలసి అందరికీ ఉపయోగపడేలా వైకుంఠ రథాన్ని సమకూర్చడం సంతోషంగా ఉందన్నారు. కనగాల నాగభూషణం మాట్లాడుతూ హైదరాబాదులో స్థిరపడిన గ్రామస్థులు ఒక అసోసియేషన్‌గా మహాప్రస్థాన వాహనాన్ని అందించడం గొప్ప విషయమన్నారు. అంతేకాకుండా మరోదాత కనగాల శ్రీనివాసరావు తన తల్లిదండ్రులు కనగాల సాంబశివరావు, సామ్రాజ్యంల జ్ఞాపకార్థం రూ.2లక్షలతో వైకుంఠ రథాన్ని భద్రపర్చడానికి షెడ్‌ను నిర్మించారన్నారు.

కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అలపర్తి సాంబశివరావు, సెక్రటరీ బొందులూరి శ్రీనివాస్, కోశాధికారి కె.శ్రీనివాసరావు, సభ్యులు ఎ.లక్ష్మణరావు, డి.సాయిబాబు, ఎం.శ్రీనివాసరావు, పి.సుబ్బారావు, ఎ.వెంకట్రామయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.